# ప్రపంచం—కవి సుందరం

బదరీనాథ్

(ఎప్పుడూ ఊహాప్రపంచంలో సంచరిస్తూ, వింతవింత కలలు కంటూ, వాస్తవిక జగత్తుకు దూరంగా ఉన్నట్టు నటిస్తూ, అలా ఉండడానికి ప్రయత్నిస్తూ, చివరకు జీవిత యథార్థ సన్నివేశాలలో ధైర్యం వహించి నిలబడలేక తబ్బిబ్బులైన ఒకానొక కవిగారి చరితము.)

'ప్రపంచానికీ, నాకూ మధ్య చాలా దూరం వుంది. ఓ అఖాతం అనికూడా చెప్పొచ్చు. ఎంత పొడుగు టేపుతో నైనాసరే మా మధ్య దూరం కొలవటం మహా కష్టం. ఆ దూరాన్ని నేనుగాని, ప్రపంచంగాని అంచనా వెయ్యలేం. అది అనూహ్యం, గణనాతీతమున్నూ. అయితే ప్రపంచంతో నాకున్న సంబంధాలు పూర్తిగా తెంచుకోలేదు. కవిగా-ప్రపంచంలో నిర్వర్తించాల్సిందీ, నిర్వహించాల్సిందీ బాధ్యత చాలా వుంది. దాన్ని నేనుగాని, ప్రపంచంగాని తెంచుకోలేం. అందుకు ప్రయత్నించంగూడాను. ప్రయత్నించినా అది జరగని పని. జరగని పని గాబట్టి ప్రయత్నించనూ లేదు. ప్రపంచం నానుంచి నేర్చుకోవాల్సింది చాలావుంది. అయితే ప్రపంచం నాముందు పాసిన బట్టవేసుకుని చేతులు కట్టుకుని కూర్చోదు. చేత్తో బెత్తం పుచ్చుకుని ప్రపంచాని కెదురుగా కుర్చీమీద నేనున్నూ కూర్చోను. నా రచనలద్వారా, నా కలం ద్వారా ప్రపంచం నేర్చుకోవాల్సిందెంతైనా వుంది.' ఇదీ నాలుగేళ్ల తరువాత తిరిగి నేను కలుసుకున్న సుందరం ధోరణి. నేను ఆశ్చర్యపోయాను. అసలు నాకా ధోరణే అర్థం అవలేదు. అప్పటికీ యిప్పటికీ కూడా బుర్ర బద్దలు గొట్టుకున్నా దానర్థం అలా నిగూఢంగానే వుండిపోయింది. ఆ తర్వాత మళ్ళీ నాకు సుందరం కనిపించలేదు. కాని హఠాత్తుగా ఓ పత్రిక తిరగేస్తూంటే అందులో వాడి పేరు కనిపించింది. ఆ పేరుకింద వాడి వ్యాసంకూడా వుంది. 'అ' దగ్గర్నుంచి 'అః' దాకా చదివాను. నాలుగుసార్లు, పదిసార్లు, చదివాను. చివరికి తల మొత్తుకున్నాను కూడాను. దాని భావమేమిటో, అసలు వాడి ఉద్దేశం యేమిటో నాకేమీ అర్థం కాలేదు. ఎంత గింజుకున్నా అది కొరుకబడలేదు. అసలా పత్రికలో అది యెల్లా ప్రచురితమైందో నాకుమాత్రం తెలియకండా వుంది. ముందు ఆ పత్రికా సంపాదకుడికి దానర్థం తెలిసిందా అని ఓ అనుమానం పట్టుకుంది. ఆ పత్రికలో ఖాళీ పుష్కలంగా వుండటమే కారణమని తోస్తోంది. అతనంతకు ముందు తనకే అర్థంకాని రెండు మూడు పుస్తకాలు వ్రాయటమే ఆ వ్యాస ప్రచురణానికి కారణమై యుంటుందని తరువాతరువాత ఊహించాను.

'ఒక రోజున దస్తా కాగితాలు గరుకు గరుకు మనిపిస్తూ బుడ్డెడు సిరాలో మునుగుతూ తేల్తూన్న నా కలం నన్నిలా ప్రశ్నించింది' ఇదీ అతని వ్యాసంలోని మొదటి పేరాలో మొదట వాక్యంలోని మొదటి పంక్తి. నా చదువు కంతటితో బ్రేకులు పడ్డయ్. నా చిన్న మెదడులో యెన్నో అనుమానపు విత్తనాలు గారిడీలోలాగ మొక్కలు మొల్చి, పూసి, పిందెలేసి కాయలయి ఫలించకుండా మాత్రం వుండిపోయినయ్. నా మొదటి అనుమానం యేమిటంటే—రాస్తున్నది సుందరమా? లేక అతని కలమా?—వాడు మరోలా రాస్తే నా కనుమానం లేకపోయేది. అసలీ అనుమానానికి మూలకారణం 'కలం నన్ను ప్రశ్నించింది' అన్న ముక్కే. కలం ప్రశ్నించడమేమిటి! పైగా బుడ్డెడు సిరాలో కలం మునకలెయ్యడమేమిటి? కలం సిరాలో, కాకపోతే మరెందులో మునక

లేస్తుంది?' ఆసలు దా నర్థంయేమిటి? సమస్య విడలేదు.

రెండో ముక్క చదివాను! 'గిరగిరా తిరుగుతూన్న భూతలి హఠాత్తుగా ఆగిపోయి నా బోధనలం ఆలకిస్తోంది' మామూలుగా నే నన్నను మానాలం చుట్టుకొన్నయ్. గిరగిరా తిరుగుతూన్న భూమి 'త' క్కున ఆగిపోవడమేమిటి? పోనీ—ఆగిందయ్యా, ఇంతమంది మనుష్యులూ వుంటే వాడి వేపే చూడ్డమేమిటి? పోనీ—చూసిందే అనుకుందాం. ఇంతమంది మహాపురుషుల బోధలు వినక పైగా వీడి వాక్కులే వినడంలో అర్థం? ఇదేమిటో స్వోత్కర్షలా వుంది. దీన్ని సొంత డబ్బా అనకతప్పదు. ఇలా అనటంవల్ల వాడి పేరుచూసి నేను తెచ్చుకున్న యీర్ష్యవల్ల అంటున్నా ననుకుంటారేమో మీరు. ఏకోశానా నా గూడా నాకు 'యీర్ష్య' అన్న ముక్కలేదు. కావలిస్తే నాముందు గొప్పవాళ్ళయి, ధనవంతులయి, ఉద్యోగస్థులయిన వాళ్ళనే అడిగి తెలుసుకోండి. అయితే—ఇది నా సొంతడబ్బా కాదు. స్వోత్కర్ష అంతకంటే కాదు. నాముందు గొప్ప వాళ్ళయి ధనవంతులయి, ఉద్యోగస్థులయిన వాళ్ళిచ్చిన సర్టిఫికేట్ల 'ట్రూకాపీ' మాత్రమే.

సరే-అసలు విషయంలోకి దిగుదాం-మును పోమాటు తను నన్ను కలుసుకున్నప్పుడు 'భూమి నాముందు బాసినపట్టు వేసుకుని చేతులు కట్టుకుని కూర్చోదు' అన్నాడు. కాని ఈ రోజున రాసిందాంటో గిరగిర తిరుగుతోన్న భూమి తనవేపుకి తక్కిన తిరిగి ఆలించిందంటున్నాడు. కవుల కబుర్లలా వుంటాయేమో మరి. మరి కొన్నాళ్ళకి ఆపత్రికలోనే వాడు రాసిన గేయం ఒకటి పడింది.

'నల్లకుక్క,
తెల్లకుక్క!
పచ్చనబ్బు;
నీటిమబ్బు.'

ఇవీ వాడి గేయంలోని మొదటి నాలుగు ముక్కలున్నూ- దీనర్థం మూడుపగళ్ళు మూడు రాత్రులూ ఎన్ని నిఘంటువులు దగ్గర పెట్టుకు కొట్టుకున్నా బయటపడలేదు. అప్పటినించీ వాడి రచనలు చదవడం మానేశాను. చదివినా అర్థం చేసుకోడానికి ప్రయత్నించలేదు. ప్రయత్నించడం మొదలుపెట్టినా బుద్ధి తెచ్చుకుని' మానేసే వాణ్ణి. ఆతర్వాత్తరవాతవాడి రచనలు నాకెందులోనూ కనిపించలేదు. విసుగెత్తి మానేసేడేమో అనుకున్నాను. కాని విసుగెత్తడమన్నది మనకా, వాడికా అని తరవాత తమాయించుకున్నాను.

మరికొన్నాళ్ళకి మా చిన్ననాటి స్నేహితుడు ప్రభాకరం కనిపించాడు. ప్రాణం అమాంతం లేచొచ్చింది నాకు. 'ఏమిట్రా నాయనా సంగతులు' అని భుజంతట్టి అడిగాను.

'అన్నీ బాగానేవున్నాయ్ గాని, ఓ విచారకరమైన సంగతిరా' అన్నాడు సానుభూతి తెలియపరిచేలాగ మొహం ముడతలుపెట్టి. 'ఏమిటది? నాకోసమే మోసుకొచ్చావా?' అన్నా ఆత్రంతో. ప్రభాకరం అడిగాడు 'మన సుందరం గాణ్ణెరుగుదువ్ కదూ?' అని. 'అదేమిట్రోయ్. ఎరక్కపోవడమేమిటి? ఈ మధ్యని రచయిత కూడా అయ్యాడుగా వాడు' అన్నాను.

'ఆఁ. మరేరా పాపం! వాడే—'

'ఏం? ఇప్పుడు వాడికేమొచ్చిందీ?'

సిగరెట్టు బూడిద దులిపి ఒక్క దమ్ము పీల్చి ప్రభాకరం చెప్పడం మొదలుపెట్టాడు. మన వాడు రచయితవడమూ నాలుగయిదు పుస్తకములు వ్రాయటమూ జరిగిన విషయం నీకు తెలిసిందేగదూ! ఇలా వుండగా- ఒకరోజున ఓ సాహిత్యపరుడు, ఓ గ్రంథకర్త, ఓ సోదర పత్రికా రచయిత మనవాణ్ణి కలుసుకోడం తటస్థించిందిట. మనవాడాపళాన వుండొచ్చా? అబ్బే! అలాంటి తెలివితక్కువ పనేమీ చెయ్యలేదు. వీడి రచనలన్నీ తీసుకెళ్ళి ఆయనముందు పెట్టాట్ట ఆయనవన్నీ చదివి తబ్బిబ్బయి, తలక్రిందులయి వాటి అర్థం యేమాత్రమున్నూ గ్రహించలేక పోగా సుందరాన్నే అడిగాట్ట అర్థం చెప్పమని. తీరా అడిగేసరికి వీడు తెల్లమొహం వేశాడు. సుందరం తనకేమైనా తెలుసా' అని ఎదురు ప్రశ్న వేసుకున్నాట్ట. 'ఏమీ లే'దని జవాబు వచ్చింది. ఒక్కరోజు టైమడిగాట్ట ఆలోచించి చెప్పడానికి. తక్షణం తన గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాడు. గడియ కూడా పెట్టేసుకున్నాడు. అంతే- ఆ బందుచెయ్యడం బందు

చెయ్యడం—మర్నాడు మేము బద్దలుకొట్టేదాకా రాలేదా తలుపులు. తను రాసిన పుస్తకాల కట్టలమధ్యా, తన వ్యాసాలుపడ్డ పత్రికలమధ్యా సుందరం శవం పడుంది. ఒళ్ళంతా బరుక్కున్నాడు. జుట్టు పీక్కున్నాడు. మొహం గీక్కున్నాడు. తలపగిలి అక్కడ రక్తం నేలమీద బాగా అట్టకట్టింది. ఇదంతా చూసి మేం అర్థంచేసుకున్న దేమిటీ అంటే—వాడి రాతల కర్థం వాడికే తెలియక ఉడుకుమోత్తనంతో, కోపంతో అనవసరంగా బుర్ర బద్దలుకొట్టుకొన్నాడని. బుర్ర నేలకేసికొట్టుకొన్నా వాడికి అర్థం తెలీలేదన్నమాట—అని,

'పోనీ- అమాత్రానికే చావాలా' అన్నాను విచారంతో.

'అక్కర్లేదు. కాని వాడు చచ్చిపోయాడు. అసలు సంగతేమిటంటే రాత్రి, పగలూ, విధి విరామంలేకుండా దస్తాలమీద దస్తాల కాగితాలు ఖరాబుచేస్తున్నాడనిన్నీ, ఒద్దంటే వినడనిన్నీ, అందువల్లే వాడి మతి చలించిపోయిందనిన్నీ చెప్పారు, వాడి ముసిలినాన్నగారు మొత్తుకుంటూను.

ఇందుకు నేను చాలా విచారించాను. ప్రపంచంతో సంబంధంలేకుండా—ప్రపంచానికి కొలవలేనంతదూరంలో వున్న సుందరం చివరకి ప్రపంచంలోనే చచ్చిపోయాడు. భూమిమాత్రం గిరగిరా తిరుగుతూనే వుంది. వాడి సిరాబుడ్డీ నిండుగానే వుంది. కలం మాత్రం విశ్రాంతి తీసుకుంటూంది.

# ఇస్రేయెల్ పట్ల ఇండియా ప్రభుత్వ వైఖరి

**తుర్లపాటి వెంకట కుటుంబరావు**

యూదీయరాజ్యం 'ఇస్రేయెల్'ను గుర్తిస్తూ ఇండియా ప్రభుత్వం చేసిన నిర్ణయం అత్యంత సముచితమైనదే కాని, ఈసందర్భంలో జరిగిన కాలయాపన మాత్రం ఇండియా ప్రధాని రాజనీతిజ్ఞతకు అనుగుణంగా లేదు.

1048 మే 15వ తేదీనే 'ఇస్రేయెల్' అవతరించినా, 1950 సెప్టెంబర్ 17వ తేదీ సాయంకాలం వరకు ఆ రాజ్యాన్ని గుర్తించకుండా ఇండియా అనవసరంగా కాలయాపన చేయడం వల్ల యూదుల సహకార సద్భావాలను మనం కొంతవరకు కోల్పోవడం కూడా జరిగింది. నవచైనా ప్రజాప్రభుత్వాన్ని గుర్తించడంలో ఒక విధానం, ఇస్రేయెల్‌ను గుర్తించడంలో మరొక విధానం అవలంబించడమే ఇందుకు కారణం. ఒక ప్రభుత్వాన్ని గుర్తించడంలో ఆ ప్రభుత్వం పట్ల మన యిష్టాయిష్టాలతో నిమిత్తం లేదని, మనం గుర్తించబోయే ప్రభుత్వం సుస్థిరమైనదా, కాదా అనే విషయమే ప్రధానాంశమని చైనా పరిగణన విషయంలో వెలువడిన విమర్శలకు సమాధానంగా ప్రధాని పండిట్ నెహ్రూ పేర్కొన్నాడు.

ఇస్రేయెల్ ప్రభుత్వం సుస్థిరమైనదే నని ఇదివరలో ఇండియా ప్రధాని పెక్కు పర్యాయాలు ప్రకటించి వున్నాడు. అయినప్పుడు, దానిని ఇంతవరకు పరిగణించకుండా ఇండియా ప్రభుత్వం ఎందుకు జాప్యం చేసింది?

ఇస్రేయెల్‌ను గుర్తిస్తూ ఇండియా ప్రభుత్వ విదేశాంగశాఖ చేసిన ప్రకటనలో తన చర్యవల్ల అరబ్ రాజ్యాలకు ఆగ్రహం కలుగుతుందేమోనని ఆందోళన, ఆరాజ్యాలను సమాధానపరచడానికి ఇంకా యత్నం కానవస్తున్నవి. ఇస్రేయెల్ ప్రభుత్వం సుస్థిరమైనదని అంగీకరిస్తూ, దాని ఉనికిని ఆమోదిస్తూ, దానిని పరిగణించడం తనకు ఇష్టమైనా, తమ శత్రురాజ్యాన్నిగుర్తిస్తే, అరబ్ రాజ్యాలకు ఆగ్రహం కలుగుతుందని ఇండియా ప్రధాని వెనుదీయడంవింతగానేఉంది

నవచైనా ప్రజా ప్రభుత్వ ప్రాతినిధ్య విషయం ఇంకా మిత్రరాజ్యసమితిలో వివాదాస్పదంగానే వున్నది. ఆ ప్రభుత్వాన్ని అగ్రరాజ్యమైన అమెరికా, ఇంకా కొన్ని ప్రధాన రాజ్యాలు ఇంకా గుర్తించనే లేదు. దానికి మిత్రరాజ్యసమితిలో సభ్యత్వమే లేదు.